క్లుప్తంగా

నేడు బోయకొండకు పెద్దిరెడ్డి

చౌడేపల్లె: మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం బోయకొండ గంగమ్మకు పట్టువస్త్రాలు సమర్పించనున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.దామోదర రాజు, పార్టీ మండల అధ్యక్షుడు జి.నాగభూషణరెడ్డి తెలిపారు. ఆయనకు స్వాగతం పలకడానికి పార్టీ నాయకులు ఏర్పాట్లు చేశారు.

జేసీబీలు, ట్రాక్టర్ల సీజ్

పుంగనూరు: చెరువు నుంచి మట్టిని తరలిస్తున్న ఐదు జేసీబీలు, ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని కుమ్మరనత్తం చెరువు నుంచి మట్టిని తవ్వి అక్రమంగా తరలిస్తున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేశారని తెలిపారు. దీంతో చెరువు వద్దకు వెళ్లి పరిశీలించామని, అక్కడ పని చేస్తున్న మూడు ట్రాక్టర్లు, రెండు జేసీబీలను సీజ్ చేసి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎన్‌సీసీకి 40 మంది ఎంపిక

పుంగనూరు: పట్టణంలోని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వున్న 35వ బెటాలియన్ ఎన్‌సీసీకి 40 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు వైస్ ప్రిన్సిపాల్ అనీల్‌కుమార్ తెలిపారు. ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ సోమరాజు ఆధ్వర్యంలో శనివారం విద్యార్థుల ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించినట్టు పేర్కొన్నారు. ఇందులో 60 మంది పాల్గొనగా 40 మందిని ఎంపిక చేసినట్టు తెలిపారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

చౌడేపల్లె: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కింద నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ మోనా సూచించారు. ఆమె శనివారం చౌడేపల్లె పీహెచ్‌సీలో వైద్యశిబిరం నిర్వహించి మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

ఉప్పొంగిన అభిమానం

- వైఎస్సార్ సీపీ సమావేశానికి తరలివచ్చిన కార్యకర్తలు


సమావేశంలో పాల్గొన్న పుంగనూరు నేతలు

సదుం/పుంగనూరు: సదుం మండలం ఎర్రాతివారి పల్లెలో శనివారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం విజయవంతమైంది. రాష్ట్రంలోనే మొదటిసారిగా పార్టీని సంస్థాగతంగా పటిష్టం చేసేలా రూపొందించిన కమిటీ సభ్యుల సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో సభా ప్రాంగణం కిక్కిరిసింది. 30 రోజుల్లోనే నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కమిటీలను ఏర్పాటు చేసిన విధానాన్ని పార్టీ ఆర్గనైజింగ్ రాష్ట్ర కార్యదర్శి వజ్ర భాస్కర్ రెడ్డి నియోజకవర్గ సమన్వయకర్తలకు పవర్ ప్రజెంటేషన్‌తో వివరించారు. వారి విధులను తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ రెడ్డెప్ప, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్‌షరీఫ్, వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ అమ్ము, పట్టణ అధ్యక్షుడు ఇర్ఫాన్, పుంగనూరు ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, పీకేఎం వుడా మాజీ చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, మండల అధ్యక్షుడు అమరనాథరెడ్డి, రాష్ట్ర యూత్‌వింగ్ కన్వీనర్ కొత్తపల్లి చెంగారెడ్డి, జిల్లా కార్యదర్శులు చంద్రారెడ్డి యాదవ్, దేశిదొడ్డి ప్రభాకర్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి మాజీ సభ్యుడు పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.


సభకు హాజరైన అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు


సజ్జల రామకృష్ణారెడ్డిని సత్కరిస్తున్న పెద్దిరెడ్డి


సమావేశంలో పాల్గొన్న తిరుపతి, చిత్తూరు జిల్లాల నాయకులు

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయండి

పెద్దపంజాణి: గ్రామస్థాయి నుంచి వైఎస్సార్ సీపీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పలమనేరు మాజీ ఎమ్మెల్యే ఎస్.వెంకటేగౌడ పిలుపునిచ్చారు. ఆయన శనివారం రాయలపేట పంచాయతీ కమ్మపాళ్యంలో పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ పార్టీ పంచాయతీ, అనుబంధ విభాగాల కమిటీలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అధికార పార్టీ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలు, నాయకులపై ఉందన్నారు. అనంతరం గ్రామంలోని పార్టీ నాయకుడు చంద్రశేఖర్ రెడ్డిని కలిశారు. ఆయన యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గత నెలలో మృతి చెందిన శంకర్రాయలపేటకు చెందిన పార్టీ కార్యకర్త జయచంద్ర కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బాగారెడ్డి, పద్మనాభ శెట్టి, జిల్లా కార్యదర్శులు తమ్మిరెడ్డి, సుహేబ్, పార్టీ జిల్లా లీగల్ సెల్ సెక్రటరీ ఎస్.భాస్కర్ రెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు హరినాథ్, వైస్ ఎంపీపీ ఆంజమ్మ, యువత అధ్యక్షుడు సునీల్ రెడ్డి, ఎంపీటీసీ గురుమూర్తి, సర్పంచులు చంద్రశేఖర్, అమరనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

జాబ్‌మేళాలో 72 మందికి ఉద్యోగాలు

పలమనేరు: పట్టణంలోని ఎల్‌బీ నగర్‌లోని ఆర్‌సీఆర్ భవనంలో శనివారం క్వానట్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో 72 మంది ఉద్యోగాలకు ఎంపికై నట్టు నిర్వాహకురాలు తస్లీం తెలిపారు. పలు రాష్ట్రాలకు చెందిన కంపెనీ ప్రతినిధులు నిరుద్యోగులను ఇంటర్వ్యూ చేసినట్టు తెలిపారు.

మొబైల్ వెటర్నరీ క్లినిక్కులతో వైద్య సేవలు

కుప్పం రూరల్: మొబైల్ వెటర్నరీ క్లినిక్కుల ద్వారా పశువులకు వైద్య సేవలు అందిస్తున్నట్టు కడా ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. ఆయన శనివారం కొత్తయిండ్లు గ్రామంలో శ్రీజ డెయిరీ ఆధ్వర్యంలో చేపట్టిన మొబైల్ వెటర్నరీ క్లినిక్కును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోనూ మొబైల్ క్లినిక్కులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీజ డెయిరీ సీఈవో తిమ్మప్ప, ప్రతినిధులు రాజేంద్రబాబు పాల్గొన్నారు.

జగన్‌ను విమర్శించే అర్హత బాలకృష్ణకు లేదు

రొంపిచెర్ల: మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించే అర్హత హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణకు లేదని వైఎస్సార్ సీపీ మహిళ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కమలాపురం శ్రీదేవి రెడ్డి తెలిపారు. ఆమె శనివారం రొంపిచెర్లలో విలేకరులతో మాట్లాడారు. మెంటల్ సర్టిఫికెట్ కలిగిన బాలకృష్ణ ఎమ్మెల్యేగా పోటీ చేయడం ఏపీ ప్రజల దౌర్భాగ్యమన్నారు. అతను మాజీ సీఎంను సైకో అనడం అహంకారపు వ్యక్తిత్వానికి నిదర్శనమన్నారు. బాలకృష్ణ మద్యం తాగి మాట్లాడితే.. అతని అల్లుడు లోకేష్ పెద్దల సభలో మహిళా ఎమ్మెల్సీ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అసభ్య పదజాలంతో దూషించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలకృష్ణ వెంటనే జగన్‌కు క్షమపణ చెప్పాలని డిమాండ్ చేశారు.


కమలాపురం శ్రీదేవి రెడ్డి

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

పలమనేరు: అనధికారిక లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం ద్వారా 2025 జూన్ 30 నాటికి రిజిస్ట్రేషన్ అయిన అనధికారిక లేఅవుట్ల వారు ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు ఇస్తోందని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. వీటిని నిబంధనల మేరకు చేసుకుంటేనే ప్రభుత్వం ద్వారా ప్రైవేటు వెంచర్లలో మౌలిక సదుపాయాలను కల్పిస్తామని వెల్లడించారు.

మహిళలకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

గంగవరం: ప్రజలు పోషకాహారాన్ని తీసుకుంటే రోగ నిరోధక శక్తి పెరిగి రోగాలు రాకుండా ఉంటారని పలమనేరు ఏరియా ఆస్పత్రి ఇఎన్‌టీ స్పెషలిస్టు డాక్టర్ యుగంధర్ తెలిపారు. ఆయన శనివారం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ మమతారాణితో కలిసి గంగవరం పీహెచ్‌సీని సందర్శించారు. మహిళలకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ పౌష్టికాహార లోపం వల్లే ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. ఆకు కూరలు, కూరగాయలు, చిరు ధాన్యాలు తప్పక తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారులు శ్రీనివాసులు, లహరి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


మహిళల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

పెద్దపంజాణి: మహిళల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కింద వైద్య పరీక్షలు చేస్తున్నట్టు పెద్దపంజాణి, రాయలపేట పీహెచ్‌సీల వైద్యాధికారులు మురళి, మాధవి తెలిపారు. వారు శనివారం కోగిలేరు, చలమంగళం గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. మందులు అందజేశారు. అనంతరం మహిళల ఆరోగ్యం కృషి చేస్తామని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

భక్తుల కొంగు బంగారం బోయకొండ గంగమ్మ

- అంగరంగ వైభంగా దేవీనవరాత్రి ఉత్సవాలు
- భక్తులకు ఏర్పాట్లు చేసిన అధికారులు
- రూ:5116 చెల్లించి ఉభయదారులుగా పాల్గొనాలి


బోయకొండ అమ్మవారు


బోయకొండ ఆలయ ముఖచిత్రం

చౌడేపల్లె: బోయకొండలో వెలసిన గంగమ్మ భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరుపొందారు. ఇక్కడ మంగళ, శుక్ర, ఆదివారాల్లో ప్రత్యేక పూజలు జరుగుతాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాలతోపాటు కర్ణాటక, తమిళనాడు నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి తలనీలాలు, జంతు బలులు ఇచ్చి మొక్కులు చెల్లిస్తుంటారు. ఈ నెల 23 నుంచి దసరా మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అమ్మవారు ప్రతిరోజూ ఒక్కో అవతారంలో భక్తులను అనుగ్రహిస్తున్నారు. శనివారం శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆదివారం మహా చండీదేవిగా అలంకరించనున్నారు. సోమవారం సరస్వతీదేవి అలంకారం, 30న దుర్గాదేవి అలంకారం, అక్టోబరు 1న మహిషాసుర మర్దిని, 2న రాజరాజేశ్వరిదేవి అలంకరణలో భక్తులను అనుగ్రహించనున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ఈవో ఏకాంబరం తెలిపారు. ఉత్సవాల్లో ఉభయదారులుగా పాల్గొనాలనుకునే భక్తులు రూ.5116లు చెల్లించాలని సూచించారు.

పవిత్రమైన పుష్కరిణి తీర్థం.....

కొండపై అమ్మవారి ఆలయ సమీపంలో ఉన్న పుష్కరిణిలోని నీరు అతిపవిత్రమైనదిగా భావిస్తారు. ఈ నీటిని తాగితే సకల రోగాలు పోతాయని భక్తుల నమ్మకం. స్థానికులు ఇక్కడి నీటిని తీసుకెళ్లి పంటలపై చల్లుకుంటారు.

శ్రీ అమ్మవారి పుష్పము మహిమ....


భక్తులు తమ కోరికలు నేరవేరుతాయా లేదా అని తెలుసుకునేందుకు అమ్మవారి శిరస్సుపై మూడు పూలు ఉంచి కోరికలను మనస్సులో స్మరించమంటారు. పూలు అమ్మవారి కుడివైపున పడితే నెరవేరుతాయని, ఎడమ వైపు పడితే ఆలశ్యంగా జరుగుతాయని, మధ్యలో పడితే తటస్తంగా భావించాల్సి వుంటుందని అర్చకులు చెబుతున్నారు.

రూ.కోట్లతో అభివృద్ధి పనులు

ఆలయాన్ని గత ప్రభుత్వంలో అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని రూ.కోట్లతో అభివృద్ధి చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా మౌలిక వసతులు కల్పించారు. రోడ్డు వేయించారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకారం

పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవార్లు శనివారం ప్రత్యేక అలంకరాల్లో భక్తులను అనుగ్రహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



పుంగనూరు: బాలాత్రిపుర సుందరిగా పార్వతిదేవి, వి.కోట: విశేషాలంకరణలోదుర్గామాత



అన్నపూర్ణాదేవిగా మలాలమ్మ, సదుం: శాకంబరిగా చౌడేశ్వరీదేవి